ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తమిళనాడు TAMILNADU

సోమవారం 19 ఫిబ్రవరి 2024



నేడు వార్షిక బడ్జెట్ దాఖలు

● కొత్త పథకాలపై ప్రకటన?



ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభలో సోమవారం ఉదయం ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను వార్షిక బడ్జెట్‌ను దాఖలు చేయనున్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఈ బడ్జెట్‌లో కొత్త ప్రజాకర్షణ పథకాలకు సంబంధించిన ప్రకటనలు వెలువడే అవకాశాలున్నాయి. ముఖ్యంగా పుదుమైపెణ్ పథకం విస్తరణకు సంబంధించి కూడా ప్రకటన జారీ అవుతుందని సచివాలయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తంగం తెన్నరసు దాఖలు చేయనున్న తొలి బడ్జెట్ ఇదే కనుక తప్పకుండా ప్రజాకర్షణ పథకాలపై ప్రకటనలు వెలువడుతాయని అధికార పార్టీ వర్గాలు కూడా చెబుతున్నాయి. సోమవారం ఆయన బడ్జెట్‌ను సమర్పించిన తర్వాత సభ ముగుస్తుంది. మరుసటి రోజు వ్యవసాయ శాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం వ్యవసాయ బడ్జెట్‌ను దాఖలు చేస్తారు. అదే రోజున వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వ్యయభారాలకు సంబంధించిన ముందస్తు ఆర్థిక పద్దులను కూడా సమర్పించి ఆమోదించనున్నారు. ఆ తర్వాత ఆర్థిక, వ్యవసాయ బడ్జెట్లపై చర్చలు ప్రారంభమవుతాయి. ఆర్థిక బడ్జెట్‌కు సంబంధించి చర్చలు ఈ నెల 21న ఉదయం, సాయంత్రం జరిగే శాసనసభ సమావేశాల్లో జరుగుతాయని స్పీకర్ అప్పావు ఇదివరకే ప్రకటించారు. ఈ నెల 22న ఆర్థిక బడ్జెట్, వ్యవసాయ బడ్జెట్‌పై జరిగిన చర్చలకు సమాధానాలిచ్చే రీతిలో ఆయా శాఖల మంత్రులు ప్రసంగించనున్నారు.



బడ్జెట్ లోగో

నేటినుంచి డీఎంకే దరఖాస్తుల పంపిణీ



అడయార్, ఫిబ్రవరి 18: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేయాలని భావించే వారికోసం దరఖాస్తులను ఈనెల 19న సోమవారం నుంచి డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయం పంపిణీ చేయనుంది. తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయంలో ఈ దరఖాస్తులను పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు డీఎంకే కూటమి పార్టీల మధ్య సీట్ల పంపిణీపై చర్చలు జరుగుతున్నాయి. ఈ సీట్ల ఖరారుపై ఇంకా స్పష్టత రాలేదు. ఈలోపే డీఎంకే తరఫున పోటీ చేయాలని భావించే అభ్యర్థులకు దరఖాస్తులను పంపిణీ చేయాలని డీఎంకే అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఈ దరఖాస్తులను పొందేవారు అన్ని వివరాలతో పూర్తిచేసి మార్చి 1 నుంచి 7వ తేదీ సాయంత్రం 6 గంటలలోపు సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థి దరఖాస్తు రుసుంగా రూ.50 వేలు చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తులను ప్రధాన కార్యాలయంలో రూ.2 వేలు చెల్లించి కొనుగోలు చేయొచ్చని డీఎంకే ప్రధాన కార్యాలయం ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొంది.

రామేశ్వరంలో జాలర్ల నిరవధిక సమ్మె

అడయార్, ఫిబ్రవరి 18: శ్రీలంక జైళ్లలో మగ్గుతున్న తమిళ జాలర్లను విడిపించేలా సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతూ రామేశ్వరం ప్రాంతానికి చెందిన జాలర్లు సమ్మెకు దిగారు. తమ పడవలపై నల్లజెండాలు కట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈనెల 4న సముద్రంలోకి చేపల వేటకు వెళ్లిన ముగ్గురు జాలర్లను లంక నావికాదళం అదుపులోకి తీసుకుంది. ఆ తర్వాత లంక కోర్టులో హాజరుపరచగా, వారికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఈ క్రమంలో ఇదే విధంగా రెండు నెలల క్రితం లంక నావికాదళం అరెస్టు చేయగా, కోర్టు రెండేళ్ళ జైలు శిక్ష విధించింది. ఇలా అనే మంది జాలర్లు లంక జైళ్ళలో మగ్గుతున్నారు. వీరందరినీ విడుదల చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతూ రామేశ్వరం జాలర్లు డిమాండ్ చేస్తూ ఈ నిరసన తెలుపుతూ ఆందోళనకు దిగారు.

ఆ జాలర్లను విడిపించండి...

ఇదిలా ఉండగా వరుస నేరాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ రామేశ్వరం ప్రాంతానికి చెందిన ముగ్గురు జాలర్లను శ్రీలంక ప్రభుత్వం జైలు శిక్ష విధించడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళ జాలర్లపై దాడి జరపడం, లేదా అరెస్టు చేయడం వంటి సంఘటనలు శ్రీలంక నావికాదళాన్ని అలవాటుగా మారిందని, ఆ ప్రభుత్వం కొన్ని రోజుల పాటు జాలర్లను నిర్బంధించి విడుదల చేయడం ఆనవాయితీగా ఉండేదని అన్నారు. అయితే ముగ్గురు రామేశ్వరం జాలర్లను వరుస నేరాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ అరెస్టు చేసి జైలుకు తరలించడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్రమోదీ, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయశంకర్ జోక్యం చేసుకుని ఆ ముగ్గురు జాలర్లను విడిపించాలని స్టాలిన్ ఎక్స్ పేజీలో ఓ ప్రకటన విడుదల చేశారు.

టీఎన్‌సీసీ అధ్యక్షపీఠంపై సెల్వపెరుంతగై

సీఎల్పీనేతగా రాజేష్‌కుమార్



సెల్వపెరుంతగై

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఆ పార్టీ శాసనసభ్యుడు, సీఎల్పీ నేత సెల్వపెరుంతగై నియమితులయ్యారు. ఐదేళ్లపాటు ఆ పదవిలో కొనసాగిన కేఎస్ అళగిరిని ఏఐసీసీ అధిష్ఠానం శనివారం రాత్రి ఆ పదవి నుంచి తొలగించింది. అళగిరి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనువుగా పార్టీ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అళగిరి 2019 ఫిబ్రవరి 2న టీఎన్‌సీసీ అధ్యక్ష పదవిని చేపట్టారు. 1995లో సవరించిన పార్టీ నియమావళి ప్రకారం రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుల పదవీ కాలాని రెండు లేదా మూడేళ్లుగా నిర్ణయించారు. ఆ మేరకు అళగిరిని 2021లో పదవి నుంచి అధిష్ఠానం తొలగిస్తుందని పార్టీ సీనియర్ నేతలు ఎదురుచూశారు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఆయనను తొలగించడం ఖాయమని పార్టీ నేతలు భావించారు. అయినా అళగిరి ఆ పదవిలోనే కొనసాగారు. 2022లో ఏఐసీసీ అధ్యక్షుడిగా మల్లిఖార్జున ఖర్గే నియమితులైనప్పుడు కూడా అళగిరిని టీఎన్‌సీసీ అధ్యక్ష పదవి నుంచి తప్పిస్తారని ఊహాగానాలు చెలరేగాయి. కానీ అళగిరి టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా ఐదేళ్లను పూర్తి చేసుకుని ఆరో సంవత్సరం కూడా ఆ పదవిలో కొనసాగుతూ వచ్చారు. అళగిరిని పదవి నుంచి తప్పించాలని కోరుతూ అసమ్మతి వర్గానికి చెందిన నాయకులు ఢిల్లీలోనే పలుమార్లు మకాం పెట్టి అధిష్ఠానంపై ఒత్తిడి చేస్తూ వచ్చారు. అళగిరి కూడా బెంగళూరులో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలుసుకుని చర్చలు జరిపారు. దీనితో అళగిరిని లోక్‌సభ ఎన్నికల వరకూ పార్టీ పదవి నుంచి తప్పించరని అందరూ భావించారు. అయితే ఊహించని విధంగా శనివారం రాత్రి టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా సెల్వపెరుంతగైని నియిమించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటన జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో ఐదేళ్లపాటు రాష్ట్రంలో పార్టీకి విశిష్ట సేవలందించిన కేఎస్ అళగిరికి పార్టీ అధిష్ఠానం ధన్యవాదాలు తెలియజేస్తోందని ఆయన తెలిపారు.

పదేళ్ల సేవకు గుర్తింపు...

టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా నియమితులైన సెల్వపెరుంతగై రాజకీయ ప్రస్థానం తొల్ తిరుమావళవన్ నాయకత్వంలోనే డీపీఐ నుంచిప్రారంభమైంది. ఆయన తిరుమావళవన్ కుడిభుజంగా వ్యహరించేవారు. 2006లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మంగళూరు నియోజకవర్గంలో పోటీచేసి గెలిచారు. ఆ తర్వాత పార్టీలో విబేధాలు తలెత్తడంతో డీపీఐ నుంచి వైదొలగారు. 2008లో బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. రెండేళ్లపాటు ఆ పదవిలో కొనసాగారు. అటు పిమ్మట ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి 2010లో కాంగ్రెస్‌లో చేరారు. 2011లో సెంగం నియోజకవర్గంలో, 2016లో శ్రీపెరుంబుదూరు నియోజకవర్గంలో పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత 2021లో శ్రీపెరుంబుదూరు (రిజర్వుడు) నియోజకవర్గంలో పోటీ చేసి గెలిచారు. సీఎల్పీ నేతగా నియమితులయ్యారు. ఇలా పదేళ్లకు పైగా సెల్వపెరుంతగై పార్టీకి చేసిన విశిష్ట సేవలను గుర్తించే అధిష్ఠానం ఆయన్ను టీఎన్‌సీసీ అధ్యక్షపదవిలో నియమించిందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. సెల్వపెరుంతగై టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా నియమితులు కావడంతో కొత్త సీఎల్పీనేతగా కన్నియాకుమారి జిల్లా కిళ్లియూరు శాసనసభ్యుడు ఎస్. రాజేష్‌కుమార్‌ను ఎన్నుకోవాలంటూ పార్టీ అధిష్ఠానం కాంగ్రెస్ శాసనసభ్యులకు ఆదేశాలు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా నియమితులైన సెల్వ పెరుంతగైకి డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్, అమ్మామక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్ తదితర నాయకులు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రకటనలు జారీ చేశారు.



సీఎల్పీనేతగా ఎంపిక కానున్న రాజేష్‌కుమార్

కాంగ్రెస్‌లో కష్టపడేవారికి గుర్తింపు లేదు

● విజయధరణి ఆగ్రహం



చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో పార్టీ శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడేవారికి గుర్తింపు లేదని, స్థానిక నాయకుల అభిప్రాయాలకు విరుద్ధంగానే పార్టీ అధిష్ఠానం నిర్ణయాలు తీసుకోవడం ఆనవాయితీగా మారిందని విలవంగోడు కాంగ్రెస్ శాసనసభ్యురాలు విజయధరణి ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయధరణి త్వరలో బీజేపీలో చేరనున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆదివారం ఆమె ఓ తమిళ టీవీ ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. విలవంగోడు నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు గెలిచిన తాను నియోజకవర్గం ప్రజల సమస్యలన్నింటినీ పరిష్కరించానని, ప్రస్తుతం ఆ నియోజకవర్గం ఆదర్శ నియోజకవర్గంగా మారిందంటే అతిశయోక్తి కాదన్నారు. ఇటు నియోజకవర్గం ప్రజలకోసం, అటు పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పాటుపడుతున్నా అధిష్ఠానం తన సేవలను గుర్తించకపోవడం శోచనీయమన్నారు. పార్టీలో కష్టపడేవారికి గుర్తింపు, గౌరవ మర్యాదలు ఉండవనడానికి నిదర్శనం సీఎల్పీ నేతను నియమిస్తూ అధిష్ఠానం ప్రకటన జారీ చేయడమన్నారు. సీఎల్పీ నేతను కాంగ్రెస్ సభ్యులంతా కలిసి ఎన్నుకుంటారని, ఈ విషయంలో పార్టీ శాసనసభ్యుల అభిప్రాయాలను తెలుసుకోకుండా నియామకం జరిగిపోయిందని మండిపడ్డారు. మహిళా శాసనసభ్యురాలిగా ఉండటం వల్ల అన్ని విషయాల్లో తనను పట్టించుకోవడం మానేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను బీజేపీలో చేరనున్నట్లు వార్తలు వెలువడుతున్నాయని, ఈ విషయమై త్వరలోనే తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని విజయధరణి పేర్కొన్నారు.





తేనాంపేటలో దివంగత ముఖ్యమంత్రి కామరాజర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సెల్వ పెరుంతగై - టీఎన్‌సీసీ కొత్త చీఫ్‌గా నియమితులైన ఎమ్మెల్యే సెల్వపెరుంతగై ను సత్కరిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం

టీఎన్‌సీసీ కొత్త చీఫ్ సెల్వపెరుంతగై

ప్యారీస్, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడంతో పాటు మతా రాజకీయాలకు తావుండదని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) నూతన అధ్యక్షుడిగా నియమితులైన ఎమ్మెల్యే సెల్వ పెరుంతగై అన్నారు. రాష్ట్ర అసెంబ్లీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న సెల్వపెరుందగైను టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా నియమించినట్లు ఆ పార్టీ అధిష్ఠానం శనివారం రాత్రి ప్రకటించిన నేపథ్యంలో, ఆయన ఆదివారం చెన్నైలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం 10.30 గంటలకు సైదాపేట లిటిల్ మౌంట్ జంక్షన్‌లో ఉన్న మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. అనంతరం గిండి గాంధీ మండపంలో ఉన్న మహాత్మాగాంధీ, దివంగత ముఖ్యమంత్రి కామరాజర్, రాజా అన్నామలైపురంలోని బాబాసాహెబ్ డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలదండలు సమర్పించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఏఐసీసీ అధిష్ఠానం తనకు తమిళనాడు పార్టీ పగ్గాలు అప్పగించిందని, సార్వత్రిక ఎన్నికల్లో డీఎంకే కూటమిని మెజార్టీ స్థానాల్లో గెలిపించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. పార్టీ జాతీయ నాయకులు సోనియా, రాహుల్, మల్లిఖార్జున ఖర్గేకు తాను విశ్వాసంగా ఉంటానన్నారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో చాలా కాలంగా తిష్ఠ వేసిన ముఠా రాజకీయాలకు స్వస్తి పలికేలా తాను సీనియర్ నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలతో స్నేహపూర్వకంగా ఉంటానని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వల్ల దేశానికి ముప్పు అని, తమిళనాట బీజేపీని చిత్తుగా ఓడించడమే తన లక్ష్యమన్నారు. యాభై ఏళ్లగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో లేకపోయినప్పటికీ, సీనియర్ నేతల సహకారం, కార్యకర్తల విశ్వాసం వల్ల రాజకీయాల్లో తన ఉనికిని నిలబెట్టుకుందన్నారు. డీఎంకే కూటమిలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీచేసిన స్థానాలతో పాటు అదనపు స్థానాలు కేటాయించాలని కోరాల్సిందిగా పార్టీ అధిష్ఠానంతో మరో రెండు రోజుల్లో సమావేశమై చర్చించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే విజయధరణి బీజేపీ కండువ కప్పుకోరని, ఆమె సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో తమతో పాటు పాల్గొంటారని సెల్వ పెరుంతగై తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుడు సింగారవేలన్‌కు నివాళి



సింగారవేలన్‌కు నివాళి అర్పిస్తున్న మంత్రి టీఎం అన్బరసన్ తదితరులు

అడయార్, ఫిబ్రవరి 18: స్వాతంత్ర్య సమరయోధుడు సింగారవేలర్ 165వ జయంతి వేడుకలను పురస్కరించుకుని, ఆయన చిత్రపటానికి రాష్ట్ర మంత్రి, ఉన్నతాధికారులు పుష్పాంజలి ఘటించారు. స్థానిక ప్యారీస్, బీచ్ రైల్వే స్టేషన్ సమీపంలోని కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి టీఎం అన్బరసన్, ఉత్తర చెన్నై ఎంపీ కళానిధి వీరాస్వామి, జీసీసీ మేయర్ ఆర్.ప్రియ, డిప్యూటీ మేయర్ మహేశ్ కుమార్, జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తదితర ఉన్నతాధికారులు ఉన్నారు. అదేవిధంగా సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో సీనియర్ నేత జి.రామకృష్ణన్, సమత్తువ మక్కల్ కట్చి ఆధ్వర్యంలో ఆ పార్టీ అధ్యక్షుడు ఎర్నావూర్ నారాయణన్ నివాళి అర్పించారు.

సీటు మార్చినందుకు బాధ లేదు

● ఓపీఎస్



పెరంబూర్, ఫిబ్రవరి 18: శాసనసభ హాలులో సీటు మార్చినందుకు బాధగా లేదని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం తెలిపారు. మదురై విమానాశ్రయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గతంలో ఆ సీటు వారే ఇచ్చారు... ప్రస్తుతం వారే తీసుకున్నారు... అని వ్యాఖ్యానించారు. బీజేపీ మద్దతుపై ఎలాంటి మార్పు లేదన్నారు. 10 ఏళ్లలో ప్రధాని మోదీ నేతృత్వంలో సుపరిపాలన సాగిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీతో కూటమి విషయమై చర్చలు సాగుతున్నాయన్నారు. టీటీవీ దినకరన్, శశికళ తనతో కలసి రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. మెకెదాటు డ్యాం నిర్మాణానికి కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన చర్యలను నిరసిస్తూ శాసనసభలో తీర్మానం చేయాలన్నారు. ఈ విషయపై సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో పాటు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఓపీఎస్ డిమాండ్ చేశారు.

రూ.85.5కోట్లతో తిరునల్వేలి జంక్షన్ బస్‌స్టేషన్

● ప్రారంభించిన మంత్రి ఉదయనిధి

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం తిరునల్వేలి జంక్షన్ వద్ద స్మార్ట్ సిటీ పథకం కింద రూ.85.5 కోట్లతో నిర్మించిన కొత్త బస్‌స్టేషన్‌ను ఆదివారం ఉదయం రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి ప్రారంభించారు. ఈ బస్‌స్టేషన్ నుంచి సర్వీసులను జెండా ఊపి ప్రారంభించారు. ఆ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆ జిల్లాలో రూ.436 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పథకాలకు కూడా ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సభకు స్పీకర్ అప్పావు అధ్యక్షత వహించారు. మంత్రులు కేఎన్ నెహ్రూ, అనితా రాధాకృష్ణన్, మనో తంగరాజ్, జిల్లా కలెక్టర్ కార్తికేయన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ... అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో ప్రారంభించిన బస్‌స్టేషన్ నిర్మాణం చట్టపరమైన చిక్కుల వల్ల నత్తనడక సాగిందని, డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి రాగానే అవి తొలగి నిర్మాణం శరవేగంగా పూర్తయ్యిందని తెలిపారు. జిల్లాలోని డార్లింగ్‌నగర్‌లో రూ.6.50 కోట్లతో ఇండోర్ స్టేడియాన్ని నిర్మించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో గ్రామ స్థాయి వరకూ ప్రభుత్వ పథకాల ఫలితాలు అందరికీ అందించటమే డీఎంకే ద్రావిడ తరహా పరిపాలన ముఖ్యోద్దేశమన్నారు. ఇటీవల తిరునల్వేలి జిల్లాల్లో వర్షబీభత్సం ఏర్పడినప్పుడు ప్రజలను కాపాడేందుకు చర్యలు చేపట్టిన అధికారులందరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ జిల్లాలో వరద బాధితులను ఆదుకునేందుకు యువజన విభాగం మహానాడును రద్దు చేసుకుని తాను, ఇతర మంత్రులు మకాం పెట్టామని చెప్పారు. గత ఐదేళ్లుగా కేంద్రప్రభుత్వానికి రాష్ట్రప్రభుత్వం రూ.6లక్షలకు పైగా పన్నుల వసూలు ద్వారా ఆదాయం అందించినా, కేంద్రం 1.5లక్షల కోట్ల మేరకే రాష్ట్రానికి నిధులు విడుదల చేసిందని విమర్శించారు. రాష్ట్రం రూపాయి ఆదాయాన్ని సమకూర్చితే కేంద్రం అందులో 29 పైసలనే కేటాయిస్తుండటం గర్హనీయమన్నారు. తిరునల్వేలి కార్పొరేషన్ కమిషనర్ ఠాక్రే శుభం జ్ఞానదేవ్‌రావ్ వందన సమర్పణతో ఈ సభ ముగిసింది.



బస్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో సర్వీసులను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి ఉదయనిధి తదితరులు

సమాచార దృశ్యిని

కోవై నుంచి గోవా, హైదరాబాద్‌కు విమానసేవలు

పెరంబూర్, ఫిబ్రవరి 18: కోయంబత్తూర్ విమానాశ్రయం నుంచి నిలిపివేసిన గోవా, హైదరాబాద్ తదితర నగరాలకు విమానసేవలు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఈ విమానాశ్రయం నుంచి చెన్నై, ఢిల్లీ, ముంబై, బెంగళూరు తదితర నగరాలు, షార్జా, సింగపూర్ తదితర విదేశాలకు విమాన సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ విషయమై కోవై విమానాశ్రయ అధికారులు మాట్లాడుతూ... కోవై - గోవా మధ్య విమానసేవలు ప్రారంభమయ్యాయని, మార్చి నుంచి రోజు వారంలో నాలుగు రోజులు ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. గోవా నుంచి ఉదయం 10 గంటలకు బయల్దేరే విమానం 11 గంటలకు కోవై చేరుకుంటుంది. అలాగే, కోవై నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయల్దేరే విమానం 1 గంటలకు గోవా చేరుకుంటుంది. అలాగే, కోవై నుంచి హైదరాబాద్‌కు ఈ నెల 21 నుంచి సేవలు ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు.

25న తూత్తుకుడికి ముఖ్యమంత్రి

పెరంబూర్, ఫిబ్రవరి 18: విన్‌ఫాస్ట్ కర్మాగార నిర్మాణం భూమి పూజకు సీఎం స్టాలిన్ ఈనెల 25న తూత్తుకుడిలో పర్యటించనున్నారు. ఇటీవల చెన్నైలో నిర్వహించిన ప్రపంచ పెట్టుబడిదారుల మహానాడులో... తూత్తుకుడిలో రూ.16 వేల కోట్లతో కర్మాగారం నిర్వహించేలా విన్‌ఫాస్ట్ ఆటో లిమిటెడ్‌తో ప్రభుత్వం అవగాహన కుదుర్చుకుంది. ఈ కర్మాగారానికి తూత్తుకుడి సిల్లానత్తం సిప్కాట్‌లో 408 ఎకరాలను కేటాయించారు. పుదుకోటలో నిర్వహించనున్న వరద సహాయాల పంపిణీలో కూడా సీఎం పాల్గొంటారు. పుదుకోటలో 4.5 ఎకరాల్లో ఉన్న క్రీడా మైదానంలో ప్రేక్షకుల గ్యాలరీ, వేదిక తదితరాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారని సచివాలయం పేర్కొంది.

వేసవిలో విద్యుత్ కోతలుండవు

పెరంబూర్, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో రానున్న వేసవిలో విద్యుత్ కోతలుండవని విద్యుత్ బోర్డు తెలియజేసింది. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ మార్గాల్లో మరమ్మతులు వేగవంతం చేశామని, అందువల్ల విద్యుత్ కోతలు ఉండవని తెలిపింది. అదే సమయంలో, పబ్లిక్ పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో, విద్యార్థుల సౌకర్యార్థం విద్యుత్ కోతలు తలెత్తకుండా చూడాలని ఇంజనీర్లకు విద్యుత్ బోర్డు ఉత్తర్వులు జారీచేసింది.

ఐదు జిల్లాలకు బర్డ్ ఫ్లూ అలర్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 18: రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో బర్డ్ ఫ్లూ నియంత్రణ ముందస్తు చర్యలు తీవ్రతరం చేయాలని ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్ర రాష్ట్రం నెల్లూరులో గత 10 రోజుల్లో 10 వేల కోళ్లు మృతి చెందాయన్నారు. వీటి మృతికి హెచ్5ఎన్1 ఇన్ఫ్లుయెంజా వైరస్(బర్డ్ ఫ్లూ) కారణమని పరిశోధనల్లో తెలిసిందన్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్ర సరిహద్దు జిల్లాలైన తిరువళ్లూర్, రాణిపేట, వేలూరు, తిరుపత్తూర్, కృష్ణగిరి తదితర ఐదు జిల్లాల సరిహద్దుల్లోని ప్రతి చెక్‌పోస్ట్‌లో వైద్యులు, పారా మెడికల్ సిబ్బందిని నియమించాలన్నారు. ఆయా జిల్లాల్లో కోళ్లు మృతిచెందిన వెంటనే ఆ విషయాన్ని జిల్లా యంత్రాంగానికి సత్వరం తెలియజేసేలా చర్యలు చేపట్టాలని ఆరోగ్య శాఖ సర్క్యులర్‌లో పేర్కొంది.

న్యాయ పరిశోధన కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఫిబ్రవరి 19: తమిళనాడు అంబేడ్కర్ న్యాయ విశ్వవిద్యాలయంలో, న్యాయ పరిశోధన కోర్సుల అడ్మిషన్లు విద్యార్థులు దరఖాస్తు సమర్పించవచ్చు. అంబేడ్కర్ న్యాయ విశ్వవిద్యాలయంలో 2021-22లో న్యాయ పరిశోధనలు ప్రోత్సహించేలా 132 మంది విద్యార్థులను పరిశోధన విభాగంలో చేర్చారు. వచ్చే విద్యా సంవత్సరం పరిశోధన కోర్సుల్లో 92 ఖాళీ సీట్ల భర్తీ చేపట్టనున్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు www.tndalu.ac.inలో ఈనెల 29వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలని వర్సిటీ రిజిస్ట్రార్ గౌరి రమేష్ పేర్కొన్నారు.

యూట్యూబ్ ఛానల్ ప్రారంభంపై శిక్షణ

పెరంబూర్, ఫిబ్రవరి 18: ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి పథకంలో భాగంగా, సొంతంగా యూట్యూబ్ ఛానల్ ప్రారంభించడంపై శిక్షణ ఇవ్వనున్నారు. గిండిలో ఉన్న రాష్ట్రప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి కార్యాలయంలో ఈనెల 21 నుంచి 23వ తేది వరకు ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు తరగతులు నిర్వహించనున్నారు. శిక్షణ పొందగోరు వారు రూ.5 వేలు ఫీజుగా చెల్లించాల్సి ఉండగా, శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందిస్తారు. టెన్త్ ఉత్తీర్ణులైన 18 ఏళ్ల పూర్తయిన వారు ఈ తరగతుల్లో చేరవచ్చు. ఈ తరగతుల్లో చేరేందుకు ముందస్తు పేరు నమోదు తప్పనిసరి అని, మరిన్ని వివరాలకు www.editn.inలో కానీ, 044-22252081, 22252081, 8668102600, 8668100181అనే నెంబర్లలో సంప్రదించవచ్చు.

రేపు పోరూర్‌లో విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, ఫిబ్రవరి 18: స్థానిక పోరూర్ ప్రాంత పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కార సమావేశం మంగళవారం జరగనుంది. పోరూర్ చెట్టియార్ అగరం వీధిలో ఉన్న ఎస్మార్ఎంసీ ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో ఉదయం 11 గంటల నుంచి జరగనున్న శిబిరంలో, ఆ ప్రాంత వినియోగదారులు పాల్గొని సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని ఈబీ తెలిపింది.

అగ్నివీరుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఫిబ్రవరి 18: రాష్ట్రంలోని 11 జిల్లాలు, పుదుచ్చేరిలో రక్షణ శాఖలో అగ్ని వీరులను ఎంపిక చేయనున్నారు. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. కడలూరు, వేలూరు, తిరుపత్తూర్, రాణిపేట, తిరువణ్ణామలై, చెన్నై, తిరువళ్లూర్, విల్లుపురం, కళ్లకుర్చి, కాంచీపురం, చెంగల్పట్టు తదితర జిల్లాలు, పుదుచ్చేరికి చెందిన అవివాహ యువతీ, యువకులు www.joinindianarmy.nic.inలో ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. రాతపరీక్షకు సంబంధించిన హాల్ టిక్కెట్లు ఏప్రిల్ 11 నుంచి పంపిణీ చేయనున్నారు. వివరాలకు నెం.044-25674924లో సంప్రదించవచ్చు.

ఉచిత బస్సు ప్రయాణం

● ప్రతిరోజూ 45 లక్షల మంది మహిళల ప్రయాణం

వేళచ్చేరి, ఫిబ్రవరి 18: రాష్ట్రప్రభుత్వ బస్సుల్లో ప్రతిరోజు 45 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎన్నికల మేనిఫేస్టోలో ఇచ్చిన హామీ పథకాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. ఈ పథకంలో నగరాల్లో నడుపుతున్న సాధారణ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. ఈ పథకం మహిళల్లో మంచి ప్రజాదరణ పొందింది. ఈ పథకంలో భాగంగా ప్రతిరోజు 45 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తుండగా, ఒక్కో మహిళ నెలకు సుమారు రూ.900 వరకు ఆదా చేస్తున్నారు. ఈ పథకం కోసం రాష్ట్రప్రభుత్వం రూ.2,800 కోట్లను రవాణా సంస్థకు అందిస్తోందని అధికారులు తెలిపారు.

బాణసంచా పేలుడు మృతుల కుటుంబాలకు తలా రూ.5.05లక్షల పంపిణీ


మృతులు కుటుంబీకులకు ఆర్థికసాయం అందిస్తున్న మంత్రులు

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా ఆలంకుళం వద్ద బాణసంచా తయారీ కర్మాగారంలో శనివారం మధ్యాహ్నం సంభవించిన పేలుడులో మృతి చెందిన పదిమంది కార్మికుల కుటుంబాలకు ఆర్థికసహాయాన్ని రాష్ట్ర మంత్రులు ఉదయనిధి, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, సీవీ గణేశన్ అందజేశారు. విరుదునగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మృతుల కుటుంబీకులకు సీఎం ప్రకటించినట్లు రూ.3 లక్షలను, ప్రధాని మోదీ ప్రకటన మేరకు జాతీయ విపత్తుల నిధి నుంచి రూ.2లక్షలను, అంతిమ క్రియలకు రూ.5వేలు కలిపి మొత్తం రూ.5.05లక్షల చొప్పున పంపిణీ చేశారు. మొత్తం పదిమంది కార్మికుల కుటుంబాలకు రూ.50.50లక్షలను చెక్కుల రూపంలో అందజేశారు. పేలుడు సంఘటనలో అవేరాజ్, ముత్తు, రమేష్, కరుప్పసామి, గురుసామి, మునియసామి, శాంతా, మురుగజోతి, జయా, అంబికా అనే పదిమంది కార్మికులు దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో రంగమ్మాళ్, శివకుమార్, ముత్తుకుమార్, అన్నలక్ష్మి సహా ఎనిమిదిమంది తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరికి కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లు రూ.లక్ష చొప్పున మంత్రులు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు శీనివాసన్ (విరుదునగర్), రఘురామన్ (సాత్తూరు), జిల్లా కలెక్టర్ జయశీలన్, ఎస్పీ ఫెరోజ్ ఖాన్ అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకే పథకాలు అటకెక్కించారు : ఎడప్పాడి ధ్వజం

ప్యారీస్: అమ్మ క్యాంటీన్, చదువుకున్న యువతులకు మంగళసూత్రం ఉచితంగా పంపిణీ వంటి అన్నాడీఎంకే పథకాలను డీఎంకే ప్రభుత్వం అటకెక్కించిందని పళనిస్వామి ధ్వజమెత్తారు. మైలాడుదురై జిల్లా శీర్గాళిలో ఆదివారం ఉదయం పళనిస్వామి సమక్షంలో వివిధ పార్టీల నుంచి సుమారు 3,000 మంది అన్నాడీఎంకేలో చేరారు.ఈసందర్భంగా ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ... అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు,మాజీసీఎం దివంగత ఎంజీఆర్ పేద కుటుంబాల్లోని పిల్లలకు నాణ్యతతో కూడిన విద్యుత్‌తో పాటు పౌష్టికాహార పథకాన్ని పరిచయం చేశారని, ఆయన తర్వాత అన్నాడీఎంకే పగ్గాలు చేపట్టిన దివంగత ముఖ్యమంత్రి జయలలిత కూడా బడుగు, బలహీన వర్గాల కుటుంబాల సంక్షేమార్థం దాదాపు 60కి పైగా పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా కొనసాగించారని తెలిపారు. ముస్లింలు, క్రైస్తవులకు తాను ముఖ్యమంత్రిగా వ్యవహరించిన సమయంలో పలు రాయితీలు కల్పించానని తెలిపారు. అన్నాడీఎంకే పథకాలకు ప్రజాదరణ పెరుగుతుండడం చూసి ఓర్వలేకే ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం వాటిని అటకెక్కించిందన్నారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 'నీట్' రద్దు చేస్తామని ఇచ్చిన హామీని డీఎంకే, మూడేళ్లుగా పట్టించుకోలేదన్నారు. సుమారు లక్ష సంతకాలు సేకరించిన ప్రతులను సేలం డీఎంకే యువజన మహానాడు తర్వాత పక్కన పెట్టారని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలతో చేతులు కలపాలని కార్యకర్తలు కోరుతున్నారని అయితే, జాతీయ పార్టీలతో ఎట్టి పరిస్థితుల్లోనూ పొత్తు కుదుర్చుకోబోమని ఈపీఎస్ మరోమారు స్పష్టం చేశారు.

షిర్డీ సాయి దుస్తుల్ని దర్శించిన భక్తులు



పెరంబూర్, ఫిబ్రవరి 18: స్థానిక న్యూ వాషర్‌మెన్‌పేట కామరాజర్ రోడ్డులో ఉత్తర చెన్నై షిర్డీ సాయి బాబా ఆలయం ఉంది. ఈ ఆలయానికి నగరం సహా పలు ప్రాంతాల నుంచి ప్రతిరోజు పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి బాబాను దర్శించుకుంటారు. ఈ క్రమంలో, షిర్డీ సాయి బాబా ధరించిన 140 ఏళ్ల ప్రాచీన అంగీతో కూడిన దుస్తులను మహారాష్ట్ర రాష్ట్రం షిర్డీ నుంచి ఈ ఆలయానికి తీసుకొచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులు క్యూలైన్లలో వేచి ఈ దుస్తులను వీక్షించారు.

జయలలిత జయంతికి సేవా కార్యక్రమాలు

పెరంబూర్, ఫిబ్రవరి 18: దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత 74వ జయంతిని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలు అన్నాడీఎంకే పిలుపునిచ్చింది. జయ జయంతి సందర్భంగా రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలోని ఎంజీఆర్, జయలలిత విగ్రహాలకు, మెరీనా తీరంలో జయలలిత స్మారక మందిరం వద్ద కూడా పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నివాళి అర్పిస్తారన్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, యూనియన్ పంచాయతీలు, గ్రామ పంచాయతీల్లో పార్టీ జెండాలు ఎగురవేయాలన్నారు. జెండా స్తంభాలకు రంగులు దిద్దడంతో పాటు, స్తంభాలు లేని ప్రాంతాల్లో కొత్తవి ఏర్పాటుచేయాలని పార్టీ సూచించింది. కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాలు, రక్తదానం, అన్నదానం, పేదలకు సహాయాల పంపిణీ తదితరాలు చేపట్టాలని అన్నాడీఎంకే పిలుపునిచ్చింది.

నేడు టీవీకే నిర్వాహకుల సమావేశం

● సభ్యత్వ ముమ్మర కార్యక్రమంపై చర్చలు

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తమిళ సినీ నటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రిక్కళగం (టీవీకే) నిర్వాహకుల సమావేశం సోమవారం ఉదయం జరుగనుంది. ఈ సమావేశంలో పార్టీ పతాకాన్ని, పార్టీ లక్ష్యాలను రూపొందించడం, సభ్యత్వ ముమ్మర కార్యక్రమాలు గురించి సమగ్రంగా చర్చించనున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు పనయూరులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశం జరుగుతుందని పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ తెలిపారు. పార్టీ సభ్యులందరూ ఈ సమావేశంలో తప్పకుండా పాల్గొనాలని ఆయన తెలిపారు.

వైదీశ్వరన్ ఆలయంలో ఈపీఎస్ ప్రత్యేక పూజలు


వైదీశ్వరర్ ఆలయంలోకి వెళ్తున్న ఈపీఎఫ్, ఓఎస్ మణియన్ తదితరులు

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై జిల్లా శీర్గాళి సమీపంలో ఉన్న వైదీశ్వరన్ ఆలయంలో ఆదివారం ఉదయం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ ప్రముఖులతో ఆ ఆలయాన్ని దర్శించేందుకు వెళ్లిన ఈపీఎస్‌కు ఆలయ అధికారులు, శివాచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆ తర్వాత కర్పగ వినాయకుడు, వైద్యనాథర్‌స్వామి, సెల్వ ముత్తుకుమారస్వామి, తయ్యల్ నాయకి అమ్మవారు, రంగనాథన్ సన్నిధుల వద్ద ఆయన పూజలు జిరాపు. ఆ తర్వాత గర్భాలయంలో మూలవిరాట్టును దర్శించారు. ఈపీఎస్‌తోపాటు మాజీ మంత్రి ఒఎస్ మణియన్, పార్టీ జిల్లా శాఖ కార్యదర్శి పౌన్‌రాజ్ తదితరులు పర్యటించారు.

మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరించిన డీఎంకే

అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్


మీడియాతో మాట్లాడుతున్న జయకుమార్

ప్యారీస్, ఫిబ్రవరి 18: కడలిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారుల సంక్షేమాన్ని డీఎంకే ప్రభుత్వం విస్మరించడం వల్లే వారు తరచూ దాడులకు గురవుతున్నారని అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్ విమర్శించారు. స్థానిక హార్బర్ నియోజకవర్గంలోని జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న స్వాతంత్ర సమరయోధుడు సింగారవేలర్ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి అన్నాడీఎంకే తరఫున డి.జయకుమార్, మాజీ ఎంపీ బాలగంగా తదితరులు ఆదివారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జయకుమార్ మీడియాతో మాట్లాడుతూ... డీఎంకే అధికారంలోకి వచ్చిన రోజు నుంచి రాష్ట్ర జాలర్లు దాడులకు గురవుతున్నారని, పడవలు, వలలు కోల్పోయి నష్టపోతున్నారని, ఇలాంటి దాష్టీకానికి పాల్పడుతున్న శ్రీలంక నావికాదళ సిబ్బందిని కట్టడి చేయాలంటూ కేంద్రప్రభుత్వంపై రాష్ట్రప్రభుత్వం ఒత్తిడి తీసుకురాలేదన్నారు. రాష్ట్రంలో గంజాయి వంటి మత్తుపదార్థాల వినియోగం జోరుగా సాగుతోందని, అయినా పోలీసు శాఖ దీనిని అడ్డుకొనేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని జయకుమార్ అన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలో బిహార్‌వాసి ఆత్మహత్య

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ నుంచి చెన్నైకి చేరుకున్న తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలో బిహార్‌కు చెందిన 50 యేళ్ల వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ రైలు బోగీలను కార్మికులు శుభ్రపరుస్తుండగా ఓ బోగీలో శవంగా వేలాడుతున్న వ్యక్తిని చూసి దిగ్భ్రాంతిచెందారు. వెంటనే రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైల్వే పోలీసులు జరిపిన విచారణలో ఆ వ్యక్తి బిహార్‌కు చెందిన హసన్‌గిర్లాన్ అని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జీహెచ్‌కు పంపారు.

తిరుత్తణి వద్ద కారు ఢీకొని బాలిక మృతి

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సమీపం ఆర్కేపేట రహదారిలో అదుపుతప్పిన కారు ఢీకొనడంతో బీరకుప్పానికి చెందిన రుత్తిక్ మాలిక్ (10) అనే బాలిక తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆ బాలికను చికిత్స నిమిత్తం తిరుత్తణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆ బాలిక ప్రాణాలు కోల్పోయినట్లు ప్రకటించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి కారణమైన కారుతో పరారైన వ్యక్తి ఆచూకీని కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

నేడు రంగనాథస్వామి తెప్పోత్సవం

● ఏర్పాట్లు పూర్తి

అడయార్, ఫిబ్రవరి 18: తిరుచ్చిలోని రంగనాథస్వామి ఆలయ వార్షిక వేడుకల్లో భాగంగా అత్యంత వైభవోపేతంగా నిర్వహించే తెప్పోత్సవం సోమవారం రాత్రి జరగనుంది. ఇందుకోసం ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేశంలోని 108 వైష్ణవ స్థలాల్లో మొదటిగా ప్రసిద్ధికెక్కిన ఈ ఆలయాన్ని భూలోక వైకుంఠంగా భక్తులు పరిగణిస్తారు. ఈ ఆలయంలో యేటా అనేక శుభదినాల్లో వివిధ రకాలైన వేడుకలు నిర్వహిస్తుంటారు. అలాగే, యేటా ఫిబ్రవరిలో వార్షిక తెప్పోత్సవాలను నిర్వహిస్తుంటారు. ఈ వేడుకలు ఈ నెల 11వ తేదీన ప్రారంభంకాగా, 8వ రోజైన సోమవారం తెప్పోత్సవం జరగనుంది.ఇందుకోసం మూలస్థానం నుంచి ఉత్సవ విగ్రహం మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి సాయంత్రం 5 గంటలకు తెప్పకుళం ఆస్థాన మండపానికి చేరుకుంటారు. అక్కడ నుంచి తెప్పోత్సవానికి రాత్రి 7.15 గంటలకు బయలుదేరి వెళతారు. రాత్రి 9 గంటల వరకు తెప్పలో విహరించిన తర్వాత 9.15 గంటలకు మండపానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రాత్రి 9.45 గంటలకు మూలస్థానానికి ప్రయాణమై రాత్రి 11.45 గంటలకు చేరుకుంటారు. ఈ తెప్పోత్సవానికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

విద్య సముపార్జనలో ఆసక్తి చూపాలి

● విద్యార్థులకు అతిథుల సూచన


విద్యార్థులకు పరీక్షల ఉపకరణాలు అందజేస్తున్న పీఠాధిపతి శక్తి అమ్మ, శైలేష్‌కుమార్ తదితరులు

వేలూరు, ఫిబ్రవరి 18: విద్య సముపార్జనలో ఆసక్తి చూపాలని విగ్రహాల అక్రమ తరలింపు నిరోధక విభాగం డైరెక్టర్ శైలేష్ కుమార్ యాదవ్ విద్యార్థులకు సూచించారు. శ్రీపురంలోని నారాయణి పీఠంలో ఆదివారం పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఆశీస్సులు తెలుపుతూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పీఠాధిపతి శక్తి అమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శైలేష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ... పట్టుదల, క్రమశిక్షణతో ఉన్నత విద్య పూర్తిచేసి ఉన్నత ఉద్యోగాలకు వెళ్లిన వారు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థులకు శక్తి అమ్మ పరీక్షల ఉపకరణాలు అందజేశారు.

పుదుపేట క్వార్టర్స్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కీల్పాక్ పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న సురేష్ అనే కానిస్టేబుల్ పుదుపేట పోలీసు క్వార్టర్స్‌లోని తన ప్లాట్‌లో ఉరివేసుకున్నారు. సురేష్ భార్యాపిల్లలు కొద్ది రోజులకు ముందు వారి స్వస్థలానికి వెళ్లారు. ఇంటిలో ఒంటరిగా గడుపుతున్న సురేష్ శనివారం రాత్రి మద్యం తాగి ప్లాట్‌కు వెళ్లారు. ఆ తర్వాత ఉరివేసుకున్నాడు. ఈ మేరకు ఎగ్మూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

విత్తమంత్రి నిర్మలమ్మ అబద్ధాల పుట్ట

● ఆరోగ్య మంత్రి సుబ్రహ్మణ్యం ధ్వజం

అడయార్, ఫిబ్రవరి 18: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఒక అబద్ధాల పుట్ట అని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రహ్మణ్యం ధ్వజమెత్తారు. ఆమె నోటి నుంచి వచ్చేవన్నీ పచ్చి అబద్ధాలేనని మండిపడ్డారు. ఇంటర్నేషనల్ సిటీ ఆరోవిల్‌లో ఆదివారం మారథాన్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రంగులతో తయారు చేసే పీచు మిఠాయినే నిషేధించామని, రంగు లేని మిఠాయి విక్రయాలపై కాదన్నారు. ద్రావిడ మోడల్ పాలన విభజన వాదాన్ని ప్రేరేపిస్తుందంటూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ వేదికగా అసత్యాలు చెప్పారన్నారు. అలాగే, మదురైలో కేంద్రం నిర్మించ తలపెట్టిన ఎయిమ్స్ ఆస్పత్రిపై కూడా ఆమె అబద్ధాలే మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈ ఆస్పత్రి నిర్మాణం జాప్యానికి కారణం స్థల సేకరణ అని లోక్‌సభలో ఆమె వెల్లడించారని గుర్తు చేశారు. ఇదే నిజమైతే మొదటి ముద్దాయి మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, రెండో వ్యక్తి ప్రధాని నరేంద్ర మోదీ అవుతారన్నారు. ఎందుకంటే, ఈ ఆస్పత్రి నిర్మాణం కోసం శంకుస్థాపన గత అన్నాడీఎంకే ప్రభుత్వంలో ప్రధాని నరేంద్రమోదీ చేతులు మీదుగా జరిగిందన్నారు. ఒక ఆస్పత్రి నిర్మాణానికి గత ప్రభుత్వం స్థల సేకరణ చేపట్టకుండానే ప్రధానితో ఎలా శంకుస్థాపన చేయించారనీ? ఎయిమ్స్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన స్థలం ప్రైవేటు వ్యక్తులదా? అలాంటి స్థలంలో ఎలా శంకుస్థాపన చేయించారని మంత్రి సుబ్రహ్మణ్యం నిలదీశారు. నిధుల కొరత కారణంగా మదురై ఎయిమ్స్‌కు నిధులను విడుదల చేయలేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నిజాన్ని చెబితే ఒక్కమాటలో పోయేదని, ఇందుకోసం ఇన్ని అబద్ధాలు ఆడాల్సిన పనిలేదన్నారు.

బాణసంచా పేలుడు... కర్మాగారం ఫోర్‌మేన్ అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 18: విరుదునగర్ జిల్లా రామన్‌దేవన్‌పట్టిలో జరిగిన బాణసంచా పేలుడు ఘటనకు సంబంధించి ఆ కర్మాగారం ఫోర్‌మేన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం మధ్యాహ్నం 12.45 గంటల ప్రాంతంలో ఫ్యాన్సీరకం టపాసులు తయారు చేస్తుండగా ప్రమాదం జరిగింది. ఇందులో పదిమందివరకు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో నలుగురు మహిళలున్నారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో ఈ పేలుడుపై కేసు నమోదు చేసిన పోలీసులు... బాణసంచా కర్మాగారంలో ఫోర్‌మేన్‌గా పనిచేసే సురేష్ కుమార్‌ను అరెస్టుచేయగా,పరారీలో ఉన్న కంపెనీయజమాని విఘ్నేష్, ఈయన భార్య జయమాల కోసం గాలిస్తున్నారు.

అలల్లో చిక్కుకుని బాలుడి మృతి

వేళచ్చేరి, ఫిబ్రవరి 18: సముద్ర అలల్లో చిక్కుకొని బాలుడు మృతి చెందిన ఘటన మైలాడుదురై జిల్లాలో జరిగింది. శీర్గాళి సమీపం బాదరకుడికి చెందిన నిషార్(14)అదే ప్రాంతంలోని పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం నిషార్ తన స్నేహితులతో కలసి కూళయార్ ప్రాంతంలోని సముద్రతీరంలో స్నానానికి వెళ్లాడు. ఆ సమయంలో హఠాత్తుగా వచ్చిన భారీ అలకు నిషార్ కొట్టుకుపోయాడు.స్నేహితులు వేసిన కేకలతో అక్కడకుచేరుకున్న జాలర్లు ఆ ప్రాంతంలో గాలించగా,రెండు గంటల అనంతరం నిషార్ మృతదేహం తీరానికి కొట్టుకొచ్చింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తెల్లరంగు పీచు మిఠాయిపై నిషేధం లేదు

● మంత్రి సుబ్రమణ్యం

పెరంబూర్, ఫిబ్రవరి 18: తెల్లరంగు పీచు మిఠాయిల విక్రయాలకు నిషేధం లేదని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. మెరీనా బీచ్ సహా పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్న ఆరెంజ్, నీలి రంగు పీచు మిఠాయిల్లో క్యాన్సర్ కారక 'రొడమైన్ బి' కలుపుతున్నారని పరిశోధనల్లో నిర్ధారణ కావడంతో, రాష్ట్రంలో పీచు మిఠాయిల విక్రయాలను ప్రభుత్వం నిషేధించిందన్నారు. పుదుచ్చేరిలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం విలేఖరులతో మాట్లాడుతూ... క్యాన్సర్ కారక పదార్థం కలిసిన పీచు మిఠాయిలను మాత్రమే నిషేధించామని, తెల్ల రంగు పీచు మిఠాయి విక్రయాలకు కాదని స్పష్టం చేశారు.

పళవేర్కాడు తీరంలో డాల్ఫిన్ కళేబరం



పెరంబూర్, ఫిబ్రవరి 18: తిరువళ్లూర్ జిల్లా పళవేర్కాడు కూనంకుప్పంలోని తీర ప్రాంతానికి డాల్ఫిన్ కళేబరం కొట్టుకొచ్చింది. 5 అడుగుల పొడవు, సుమారు 150 కిలోల బరువుతో కుళ్లిన స్థితిలో ఉన్న డాల్ఫిన్ కళేబరాన్ని స్థానిక జాలర్లు అక్కడే పూడ్చిపెట్టారు. ఈ విషయమై జాలర్లు మాట్లాడుతూ... ఇటీవల పొరుగు రాష్ట్రాలకు చెందిన జాలర్లు తమ ఫైబర్ బోట్లతో ఈ తీరంలో చేపల వేట సాగిస్తున్నారని, వాటిలో ఓ బోటుకు ఢీకొని డాల్ఫిన్ మృతిచెంది ఉంటుందని జాలర్లు తెలిపారు.

బాలుడికి లైంగిక వేధింపులు

● పోక్సో చట్టం కింద యువకుడి అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 18: బాలుడిపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బంధువుల ఇంట్లో ఉంటున్న బాలుడికి అదే ప్రాంతానికి చెందిన హరీష్ (24) అనే యువకుడు పరిచయమయ్యాడు. శుక్రవారం ఆ బాలుడిని ఎవరూ లేని ప్రాంతానికి తీసుకెళ్లిన హరీష్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాలుడి కేకలు విన్న చుట్టుపక్కలి వారు అక్కడకు చేరుకొని, హరీష్‌ను చితకబాది నీలాంగరై పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి హరీష్‌ను అరెస్ట్ చేశారు.

మద్యం దుకాణాల్లో సీసీ కెమెరా లేకపోతే లైసెన్స్ రద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 18: రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాలు, బార్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయని పక్షంలో లైసెన్స్ రద్దు చేస్తామని టాస్మాక్ సంస్థ హెచ్చరించింది. మద్యం దుకాణాల్లో చట్టవ్యతిరేకంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులందాయి. త్వరలో పార్లమెంటు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, చట్టవ్యతిరేక మద్యం విక్రయాల నిరోధానికి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ టాస్మాక్ సంస్థకు లేఖ రాసింది. రాష్ట్రంలోని ఎంఎల్-2, ఎంఎల్-3 దుకాణాలు, బార్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని టాస్మాక్ సంస్థ అన్ని జిల్లాల అధికారులకు జారీ చేసింది. సీసీ కెమెరాలు ఏర్పాటుచేసిన అనంతరం వాటిని ఫొటో తీసి కార్యాలయానికి పంపాలన్నారు.

364 కిలోల గంజాయి స్వాధీనం

● ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 18: ఫైబర్ పడవలో తరలిస్తున్న 364 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. నాగపట్టినం జిల్లా ఎస్పీ హరీష్‌సింగ్ ఉత్తర్వులతో ప్రత్యేక పోలీసు బృందం శనివారం రాత్రి వేట్టైకారనిరుప్పు సమీపంలో నాలువేదపతి గౌండర్ వీధిలో తనిఖీలు చేపట్టింది. ఆ ప్రాంతంలో ఫైబర్ పడవలో దాచిన గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకుంది. ఈ వ్యవహారంలో అక్కరైపేటకు చెందిన సత్యశీలన్, నాలువేదపతికి చెందిన మహేంద్రన్, పుష్పావనం ప్రాంతానికి చెందిన సుకుమార్‌ను అరెస్ట్ చేశారు.

సేలంలో

అడయార్: సేలం జిల్లాలో 55 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి సేకరించిన గంజాయిని సేలం మీదుగా కేరళ రాష్ట్రానికి తరలిస్తున్నట్టు పోలీసులకు వచ్చిన సమాచారం వచ్చింది. దీంతో సేలం మీదుగా కేరళ వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రెండు కార్లలో భారీగా ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి కేరళకు చెందిన షిజూప్, జాఫర్, సయ్యద్ హుస్సేన్ , మహ్మద్ నౌబల్‌ను అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

కుమార్తె మృతి జీర్ణించుకోలేక తల్లిదండ్రుల ఆత్మహత్య

పెరంబూర్, ఫిబ్రవరి 18: దిండుగల్ జిల్లా కోట్టై రోడ్డు సమీపం మావుత్తన్‌పట్టిలో కుమార్తె మృతిచెందడాన్ని జీర్ణించుకోలేని తల్లిదండ్రులు విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కొద్ది నెలల క్రితం ఆర్తీ(17) అనే బాలిక ఆత్మహత్యకు పాల్పడడంతో ఆవేదనలో ఉన్న ఆమె తల్లిదండ్రులు రమేష్, కృష్ణవేణి శనివారం రాత్రి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరి మరో కుమార్తె మోహనప్రియ (23) పల్లపట్టి సిప్కాట్‌లోని ఓ ప్రైవేటు కర్మాగారంలో పని చేస్తోంది. ఈ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

సీఎండీఏ సమాచారం లీక్

ఇద్దరిపై కేసు

ప్యారీస్, ఫిబ్రవరి 18: సీఎండీఏకు సంబంధించిన సమాచారాన్ని ఎస్ఎంఎస్ ద్వారా లీక్ చేసిన ఇద్దరు ఉద్యోగులపై నగర పోలీసులు కేసు నమోదు చేశారు. రాష్ట్రప్రభుత్వం గత 1974వ సంవత్సరం సీఎండీఏను చట్టపూర్వకంగా ప్రకటించింది. ఈ సంస్థ చెన్నై, శివారు ప్రాంతాల్లో హౌసింగ్ ప్లాట్లు నిర్మించడంతో పాటు ప్రధాన బస్‌స్టేషన్లను కూడా నిర్మించే బాధ్యతలు చేపడుతోంది. ఇటీవల కీలంబాక్కంలో కొత్తగా నిర్మించిన బస్‌స్టేషన్ ప్రజలకు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో, దీని నిర్మాణం పనుల్లో పాల్గొన్న ఓ ప్రైవేటు కాంట్రాక్ట్ సంస్థకు ఈనెల 4న కోయంబేడులో ఉన్న సీఎండీఏ కార్యాలయం నుంచి ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం పంపించిన వ్యవహారం ఆలస్యంగా వెలుగుచూసింది. దీనిపై ఆ కార్యాలయంలోని టెక్నికల్ విభాగంలో పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్, వివేక్... ఈచర్యలకు పాల్పడినట్లు విచారణలో తెలియడంతో వారిపై చర్యలు తీసుకోవాలంటూ సీఎండీఏ చీఫ్ ఇంజనీర్ బాలమురుగన్ అందజేసిన ఫిర్యాదును పోలీసులు కేసుగా నమోదు చేశారు.

ఏనుగు దాడి: ఇద్దరు మహిళల మృతి

అడయార్, ఫిబ్రవరి 18: కృష్ణగిరి జిల్లా తేన్‌కన్నికోటలో ఏనుగు దాడిలో ఇద్దరు మహిళలు మృత్యువాతపడ్డారు. ఒకే రోజు జరిగిన వేర్వేరు ఘటనల్లో ఈ ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోవడంతో ఆగ్రహించిన మృతుల బంధువులు మూడు ప్రాంతాల్లో రోడ్లపై బైఠాయించారు. జిల్లాలోని అన్నియలం గ్రామానికి చెందిన వసంతమ్మ (37) దినసరి కూలీ. ఆదివారం ఉదయం ఎప్పటిలాగానే కూలికి వెళ్లింది. ఆమెపై ఏనుగు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారు. అలాగే, వసంతమ్మపై దాడి చేసిన ఏనుగు... అదే గ్రామానికి చెందిన అశ్వత్థమ్మపై దాడి చేయడంతో ఆమె కూడా ప్రాణాలు కోల్పోయారు. ఒకే రోజు రెండు విషాదకర ఘటనలు జరగడంతో మృతుల కుటుంబ సభ్యులతో పాటు ఆ గ్రామ ప్రజలంతా కలిసి ఆందోళనకు దిగారు. జనావాస ప్రాంతాల్లోకి ఏనుగులు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలంటూ ఆందోళనకారులు నినాదాలు చేశారు.

పట్టుబడిన హనుమాన్ వానరం



పెరంబూర్, ఫిబ్రవరి 18: స్థానిక వండలూరు జూ నుంచి తప్పించుకున్న హనుమాన్ వానరాల్లో ఒకదాన్ని పార్కు సిబ్బంది బంధించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి వండలూరు జూ పార్కుకు తీసుకొచ్చిన 10 వానరాల్లో రెండు తప్పించుకున్నాయి. వీటి కోసం సిబ్బంది తీవ్రంగా గాలిస్తున్న నేపథ్యంలో, ఈ వానరాలు ఓట్టేరి ప్రాంతంలో సంచరిస్తున్న సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. దీంతో, ఆ ప్రాంతంలో గాలించిన సిబ్బంది, తప్పిపోయిన వానరాల్లో, మగ వానరాన్ని గుర్తించి మత్తు ఇంజెక్షన్ వేసి బంధించి వండలూరు జూకు తరలించారు. మరో వానరం కోసం గాలిస్తున్నారు.



'డెవిల్ హంటర్స్'లో ఓ దృశ్యం

మంత్రవిద్యల నేపథ్యంలో 'డెవిల్ హంటర్స్'

మంత్రవిద్యల నేపథ్యంలో హర్రర్ థ్రిల్లర్‌గా 'డెవిల్ హంటర్స్' తెరకెక్కింది. ప్రజిత్ రవీంద్రన్ దర్శకత్వం వహించారు. రుద్రేష్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపుదిద్దుకున్న ఈ సినిమా.. మంత్రవిద్యలతో పాటు భూతప్రేత పిశాచాల గురించి వివరించనుంది. ముఖ్యంగా మనుషులు చనిపోయిన తర్వాత వారు ఆత్మలుగా మారి చేసే పనులలో సైన్స్ ఫిక్షన్ మిళితమై ఉంటుందని, చనిపోయిన వారిపై ఉన్న అపోహలను కూడా ఈ సినిమా వివరిస్తుందని దర్శకుడు ప్రజిత్ తెలిపారు. ఇప్పటివరకు వచ్చిన చిత్రాల్లో ఎవరూ చూపించని విధంగా ఇందులో మంత్ర, క్షుద్రశక్తులను వివరించామన్నారు. తనకు 25 యేళ్ళుగా తంత్రశాస్త్రం గురించి అవగాహన ఉందన్నారు. తన స్వీయ అనుభవాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్టు పేర్కొన్నారు. ముఖ్యంగా తన జీవితంలో జరిగిన కొన్ని యధార్థ సంఘటనల ఆధారంగా రూపొందించినట్టు తెలిపారు. పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను త్వరలోనూ పూర్తి చేసి సినిమాను విడుదల చేయనున్నట్టు వివరించారు.

మెగాఫోన్ పట్టిన యూట్యూబర్

యూట్యూబర్ అభిషేక్ రాజా మెగాఫోన్ పట్టారు. ప్రముఖ నిర్మాణ సంస్థ యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానరుపై నిర్మాత జి.ఢిల్లీబాబు నిర్మించే చిత్రానికి ఆయన దర్శకత్వం వహించనున్నారు. రోమాన్స్ - కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కే ఈ చిత్రానికి 'జామ్ జామ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. తమిళ చిత్రపరిశ్రమకు 'ఓ మై కడవులే', 'బ్యాచిలర్' వంటి రొమాంటిక్ హిట్ చిత్రాలను అందించిన నిర్మాత ఢిల్లీబాబు... ఇపుడు జర్నలిజంతో పాటు సోషల్ మీడియాలో తన ప్రతిభను నిరూపించుకున్న అభిషేక్ రాజాను తొలిసారి దర్శకుడిగా పరిచయం చేస్తూ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఎంటర్‌టైనర్, రొమాన్స్, థ్రిల్ ఇలా అన్ని అంశాలతో కలిపి జనరంజకంగా, అన్ని వర్గాల ప్రేక్షకులు ఆలరించేలా తెరకెక్కించనున్నట్టు దర్శకుడు అభిషేక్ రాజా పేర్కొన్నారు. ఈ సినిమాకు తేని ఈశ్వర్ సినిమాటోగ్రాఫర్‌గాను, ముకుందన్ ఉన్ని ఎడిటర్‌గా పని చేయనున్నారు. ఈ సినిమాకు పనిచేసే సంగీత దర్శకుడితో పాటు నటీనటుల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు.



అభిషేక్ రాజా



దిశా పటాని

అజిత్ సరసన దిశా పటాని

కోలీవుడ్ అగ్రహీరో అజిత్ కుమార్ నటించే 63వ చిత్రంలో బాలీవుడ్ నటి దిశా పటానిని ఎంపిక చేసేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్టు సమాచారం. నిజానికి ఈ మూవీలో మృణాల్ ఠాగూర్‌ను ఎంపిక చేయాలని తొలుత అనుకోగా, ఆమె క్యాల్షీట్స్ అందుబాటులో లేకపోవడంతో దిశా పటానిని ఎంపిక చేయాలని భావిస్తున్నారు. అయితే, ఆమె ఎంపిక గురించి చిత్ర బృందం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. కాగా, అజిత్ ప్రస్తుతం మగిళ్ తిరుమేని దర్శకత్వంలో 'విడాముయర్చి'లో నటిస్తున్నారు. ఇది పూర్తి చేసిన తర్వాత ఆయన తన 63వ చిత్రంలో నటించనున్నారు. ఈ చిత్రానికి 'మార్క్‌ఆంటోని' ఫేం ఆదిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించనున్నారు. ఈ మూవీని ప్రముఖ తెలుగు చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో తమిళం, తెలుగుతో పాన్ ఇండియా మూవీగా నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం.

మార్చి 1న 'జోష్వా ఇమై పోల కాక్క'

ప్రముఖ బడా నిర్మాత ఐసరి డాక్టర్ గణేశ్ తన సొంత నిర్మాణ సంస్థ వేల్స్ ఫిలిమ్ ఇంటర్నేషనల్ పతాకంపై ప్రముఖ దర్శకుడు గౌతం వాసుదేవ్ మీనన్ దర్శకత్వంలో తెరకెక్కించిన కొత్త చిత్రం 'జోష్వా ఇమై పోల కాక్క' సినిమా మార్చి1న విడుదలకు సిద్ధమైంది. బిగ్ బాస్ ఫేం వరుణ్ హీరోగా నటించగా, రాహే హీరోయిన్. యోగిబాబు, కృష్ణ, మన్సూర్ అలీఖాన్, విచిత్ర, దివ్యదర్శిణి తదితరులు నటించారు. ఈ సినిమా గురించి దర్శకుడు గౌతం వాసుదేవ్ మీనన్ మాట్లాడుతూ... 'నేను దర్శకత్వం వహించిన ఇతర చిత్రాల తరహాలో కాకుండా, భారీ యాక్షన్ సన్నివేశాలతో ఈ సినిమా ఉంటుంది. దాదాపు 10 నుంచి 12 యాక్షన్ సీక్వెన్సెస్ ఉంటాయి. యాక్షన్ సన్నివేశాలను 'జవాన్, 'సిటాడెల్' ఫేం యానిక్ బెన్ డిజైన్ చేశారు. ఇది క్లాసీ యాక్షన్ మూవీ. 'వేట్టైయాడు విలైయాడు', 'వారణం ఆయిరం', 'మిన్నలే' వంటి నేను దర్శకత్వం వహించిన పలు చిత్రాలు రీ రిలీజ్ అవుతున్నాయి. వీటికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. 'వెందు తణిందదు కాడు' చిత్రంలో నాలోని మరో కోణం వెలుగులోకి వచ్చింది. అదేవిధంగా ఈ సినిమా మరో కోణాన్ని తెలియజేస్తుంది. హంతకులు, గ్యాంగ్‌స్టర్‌ల నుంచి హీరోయిన్‌ను ఏ విధంగా రక్షించారన్నదే ఈ చిత్ర కథ. ఈ మూవీ ద్వారా నేను కూడా పూర్తిస్థాయిలో యాక్షన్ సినిమాలు చేయగలననే నమ్మకం వచ్చింది' అని పేర్కొన్నారు.



గౌతం వాసుదేవ్ మీనన్ - వరుణ్

చిత్రజ్యోతి

ఇంటివాడైన కోలీవుడ్ హీరో

'కీరిపుల్ల', 'కమర్‌కట్టు', 'విలైయాట్టు ఆరంభం' వంటి పలు చిత్రాల్లో హీరోగా నటించిన యువన్ అలియాస్ అజ్మల్ ఖాన్ ఇంటివాడయ్యారు. ఈయన కుంభకోణంలోని తంగ విలాస్ యజమాని సాధిక్ అలీ కుమార్తె రమీజా కహానితో నిఖా జరిగింది. ఈసీఆర్ రోడ్డులోని వీజీపీ రిసార్ట్స్‌లో జరిగిన ఈ వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి అనేక మంది సినీ రాజకీయ ప్రముఖులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్, నామ్ తమిళర్ కట్చి అధ్యక్షుడు సీమాన్, వీజీపీ అధినేత సంతోషం, క్లారియర్ ప్రెసిడెంట్ హోటల్ యజమాని అబూబకర్, సినీ నటుడు మన్సూర్ అలీఖాన్, రియాజ్ ఖాన్, ఉమా రియాజ్ ఖాన్, సంగీత దర్శకుడు శ్రీకాంత్ దేవా ఇలా అనేక మంది ప్రముఖులు హాజరయ్యారు.



వధూవరులు అజ్మల్ ఖాన్ - రమీజా

అయ్యంపట్టిలో అలరించిన జల్లికట్టు

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా చిన్నమనూరు సమీపం అయ్యంపట్టి గ్రామంలో ఏళైకాత్త అమ్మన్, వల్లడికార స్వామి ఆలయ వార్షిక ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఉదయం నిర్వహించిన జల్లికట్టు సాహసక్రీడ ప్రేక్షకులను అలరించింది. ఈ జల్లికట్టులో పాల్గొనేందుకు తేని, మదురై, తిరుచ్చి, దిండుగల్, విరుదునగర్, సేలం, కరూరు తదితర ప్రాంతాలకు చెందిన 4,500 ఎద్దుల యజమానులు, 2100 మంది యువకులు పేర్లను నమోదు చేసుకున్నారు. వెటర్నరీ డాక్టర్ల ఎరీక్షల తర్వాత 720 ఎద్దులను మాత్రమే ఈ జల్లికట్టులో పాల్గొనేందుకు ఎంపిక చేశారు. ఇదే రీతిలో వైద్యులు పరీక్షలు జరిపి 400 మంది యువకులను ఈ క్రీడలో ఎద్దులను అణచేందుకు అనుమతించారు. జిల్లా కలెక్టర్ షజీవనా, డీఎస్పీ శివప్రసాద్ జల్లికట్టును పచ్చజెండా ఊపి ప్రారంభించారు. తొలుత ఆలయ ఎద్దులను వాడివాసల్ నుంచి విడిచిపెట్టారు. యువకులు ఆ ఎద్దుల జోలికి వెళ్లకుండా నిలిచారు. ఆ తర్వాతే కొమ్ములు తిరిగిన ఎద్దులు రంకెలు వేసుకుంటూ పరుగులు తీశాయి. వాటిని అణచేందుకు యువకులు తీవ్ర ప్రయత్నాలు సాగించారు. ఈ క్రీడను తిలకించేందుకు సుమారు వెయ్యిమందికి పైగా తరలివచ్చారు. ఈ పోటీలలో యువకులకు చిక్కకుండా తప్పించుకున్న ఎద్దుల యజమానులకు బీరువాలు, మంచాలు, బంగారు కాసులను బహుమతులుగా అందజేశారు. ఎద్దులను అణచిన యువకులకు బంగారు కాసులు, బైకులు, స్టీలు పాత్రలు, మంచాలు, సైకిళ్ళను బహుమతులుగా పంపిణీ చేశారు. ఉదయం 8గంటలకు ప్రారంభమైన ఈ జల్లికట్టు సాయంత్రం 4 వరకూ నిర్విరామంగా జరిగింది. ఈ పోటీలు జరిగిన ప్రాంతం చుట్టూ పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.



వాడివాసల్ వద్దే ఎద్దును అణచేందుకు ప్రయత్నిస్తున్న యువకులు

'బీజేపీ గెలుపు...దేశానికే ఓటమి'...!

● డీఎంకే ఎంపీ కనిమొళి

పెరంబూర్, ఫిబ్రవరి 18: 'బీజేపీ గెలుపు...దేశానికి ఓటమి' అని ప్రజలు గుర్తించాలని డీఎంకే ఎంపీ కనిమొళి తెలిపారు. తిరునల్వేలి జిల్లా పాళయంకోటలో 'హక్కులు సాధించేలా స్టాలిన్ గళం' పేరుతో బహిరంగ సభ శనివారం రాత్రి జరిగింది. ఈ సభలో ఎంపీ కనిమొళి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం చేసే ప్రతి తీర్మానం రాష్ట్రాల హక్కులు హరించేవిగా ఉన్నాయన్నారు. తమకు ఓటు వేయని ప్రజలు ఎలాంటి బాధలు పడినా అభ్యంతరం లేదనే రీతిలో బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. ప్రాచీన భాష తమిళం అని పలు ప్రాంతాల్లో ప్రధాని మోదీ చెబుతున్నారని రాష్ట్ర బీజేపీ నేతలు పేర్కొంటున్నారని, కానీ ఆ ప్రాచీన భాష అభివృద్ధికి అవసరమైన నిధులు మాత్రం అందజేయడం లేదని వారు గుర్తించాలన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు వ్యతిరేకంగా పథకాలు తీసుకొచ్చేందుకు కేంద్రప్రభుత్వం యత్నిస్తుందన్నారు. జీఎస్టీ ద్వారా పొందుతున్న ఆదాయంలో రూపాయిలో 25 పైసలు మాత్రమే రాష్ట్రానికి అందిస్తున్నారని, కానీ ఉత్తరప్రదేశ్ రెండింతలుగా వాటా అందిస్తున్నారని, అదేమని ప్రశ్నిస్తే, అభివృద్ధి చెందాల్సిన రాష్ట్రం ఉత్తరప్రదేశ్ అని కేంద్రం చెబుతోందన్నారు. తిరునల్వేలి, తూత్తుకుడి జిల్లాలు ఎన్నడూ లేని విధంగా భారీవర్షాలకు తీవ్ర నష్టాన్ని చవిచూశాయని, ఆయా ప్రాంతాల బాధితులకు ఆదుకొనేలా కేంద్రప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వలేదని విమర్శించారు. గత యూపీఏ ప్రభుత్వంలో తీసుకొచ్చిన 100 రోజుల ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తూ, ఆ పథకాన్ని రద్దు చేసే యోచనలో కేంద్రం ఉందన్నారు. 'ఇండియా కూటమి గెలుపు... దేశానికి గెలుపు' అని, 'బీజేపీ గెలుపు...దేశానికి ఓటమి' అని ప్రజలు గుర్తించాలని ఎంపీ కనిమొళి విజ్ఞప్తి చేశారు.



సభలో ప్రసంగిస్తున్న ఎంపీ కనిమొళి

మానసిక ఒత్తిడి అధికమించేలా పోలీసులకు యోగా శిక్షణ

పెరంబూర్,ఫిబ్రవరి18: కోయంబత్తూర్‌లోని పోలీసు శిక్షణ పాఠశాల మైదానంలో ఆదివారం ఉదయం పోలీసులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. విధుల్లో మానసిక ఒత్తిళ్లకు గురవుతున్న పోలీసులు ఆత్మహత్యలకు పాల్పతున్నారనే ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలో, కోవై నగర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసులు మానసిక ఒత్తిడి అధిగమించేలా యోగా శిక్షణ అందిస్తున్నారు. కోవై నగర పోలీస్ కమిషనర్ బాలకృష్ణన్ పర్యవేక్షణలో జరిగిన శిక్షణకు సాయుధదళం సహా పలు విభాగాలకు చెందిన 500 మంది పురుషులు, మహిళా పోలీసులు పాల్గొనగా, యోగా గురువులు వారికి యోగసనాలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు వివరించడంతో పాటు వారిచే యోగాసనాలు చేయించారు.



యోగా శిక్షణలో పోలీసులు

పట్టీశ్వరర్ ఆలయంలో డీజీపీ ప్రత్యేక పూజలు

వేళచ్చేరి, ఫిబ్రవరి 18: పేరూర్ పట్టీశ్వరర్ స్వామి ఆలయాన్ని రాష్ట్ర డీజీపీ కుటుంబంతో సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కోయంబత్తూర్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొనేందుకు డీజీపీ శంకర్ జివాల్ శుక్రవారం కుటుంబసభ్యులతో చేరుకున్నారు. అక్కడి నుంచి పేరూర్ పట్టీశ్వరర్ ఆలయానికి వెళ్లారు. పట్టీశ్వరర్, పచ్చైనాయకి అమ్మన్, నటరాజ పెరుమాళ్‌ను సందర్శించి పూజలు నిర్వహించిన డీజీపీ, ఆలయ ఏనుగు కల్యాణి వద్ద ఆశీస్సులు తీసుకున్నారు. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ఆలయ విశేషాల గురించి ఆలయ నిర్వాహకుల వద్ద డీజీపీ అడిగి తెలుసుకున్నారు.

ఆలయ ఏనుగు వద్ద డీజీపీ ఆశీర్వాదం





మారథాన్‌లో మంత్రి సుబ్రమణ్యం

150వ మారథాన్ పూర్తిచేసిన మంత్రి సుబ్రమణ్యం

పెరంబూర్, ఫిబ్రవరి 18: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం 150వ మారథాన్ పోటీలో పాల్గొన్నారు. మారథాన్‌లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న మంత్రి సుబ్రమణ్యం, రాష్ట్రీయ, దేశీయ, ప్రపంచస్థాయి మారథాన్ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో, పర్యావరణ పరిరక్షణ కోరుతూ ఆరోవిల్‌లో జరిగిన 14వ వార్షిక మారథాన్ పోటీలు ప్రారంభించి మంత్రి, తాను కూడా పోటీలో పాల్గొన్నారు. ఐదు, పది, 21, 42 కి.మీ దూరం జరిగిన ఈ పోటీల్లో సుమారు 3,000 మంది పాల్గొన్నారు. 21 కి.మీ మారథాన్‌లో పాల్గొన్న మంత్రి, తన 150వ మారథాన్ పూర్తిచేయడం విశేషం.

300 కొబ్బరి చెట్లకు పునరుజ్జీవం

వేళచ్చేరి, ఫిబ్రవరి 18: నీరు తగినంతగా లేకపోవడంతో ఓ రైతు తన తోటలో వేసిన 300 కొబ్బరి చెట్లను వేరే ప్రాంతంలో నాటిన సంఘటన కోయంబత్తూర్ జిల్లాలో జరిగింది. సూలూరు తాలూకా పూరండాంపాళయానికి చెందిన రైతు పళనిస్వామి (55) తన ఐదు ఎకరాల తోటలో 300 కొబ్బరి నాటి పర్యవేక్షిస్తున్నాడు. ప్రస్తుతం తీవ్రవర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో, భూగర్భజలాలు 900 అడుగులకు దిగువన చేరాయి. తోటలో ఐదు ప్రాంతాల్లో బోర్లు వేసినా తగినంత నీరు లభించడం లేదు. ఒక్కో చెట్టుకు ప్రతిరోజు సుమారు 150 లీటర్ల నీరు అవసరమవుతోంది. కొద్దిరోజులు డబ్బుల వెచ్చించి ట్యాంకర్ లారీలతో నీటిని తీసుకొచ్చి చెట్లకు పోశాడు. రానున్నది వేసవి కాలం రావడం, నీటి వినియోగం అధికం కావడం, నగదు కూడా అధికంగా ఖర్చయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో, తన చెట్లను సేలక్కరిచలైకు చెందిన చిన్నదురై తోటలో నాటాలని నిర్ణయించిన పళనిస్వామి, తన తోటలోని చెట్లను వేళ్లతో పెకలించి యంత్రాల ద్వారా చిన్నదురై తోటలో నాటాడు. ఈ ప్రాంతంలో సరిపడా నీరు లభిస్తుందని పళనిస్వామి ఆనందం వ్యక్తం చేశాడు.



మరో తోటలో నాటిన కొబ్బరి చెట్లు

మూడేళ్లలో 60 వేల మందికి ఉద్యోగాలు

ప్రభుత్వ ప్రకటన

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం గత మూడేళ్లలో 60 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించినట్లు ఆదివారం సాయంత్రం ఓ ప్రకటన జారీ చేసింది. రెవెన్యూ శాఖలో 2,996 ఉద్యోగాలు, విద్యాశాఖలో 1,847 ఉద్యోగాలు, గ్రామీణాభివృద్ధి శాఖలో 857 ఉద్యోగాలు, న్యాయశాఖలో 5,981 ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించినట్లు ఆ ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రంలో ప్రైవేటు సంస్థలు నెలకొల్పుతున్న కర్మాగారాల్లో స్థానిక నిరుద్యోగ యువకులకే అధిక ప్రాధాన్యం ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నట్లు వివరించారు.

బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికల కోసం 23న డీపీఐ రాష్ట్రవ్యాప్త ధర్నా

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో జరపాలని డిమాండ్ చేస్తూ డీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా, రాస్తారోకో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నేత, ఎంపీ తొల్ తిరుమావళవన్ తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈవీఎం యంత్రాల ద్వారా అక్రమపద్ధతులలో గెలిచేందుకు ప్రయత్నిస్తోందంటూ ఆరోపించారు. ఈవీఎంల వల్ల పలుచోట్ల పోలింగ్ సక్రమంగా జరగడం లేదని, ఆ ప్రాంతాల్లో అక్రమాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికలు నూటికి నూరుశాతం బ్యాలెట్ పద్ధతిలోనే జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

శరవేగంగా సాగిన రైలు భద్రతా నిర్వహణ పనులు



బలహీనంగా ఉన్న రైలు పట్టాలను తొలగిస్తున్న కార్మికులు

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణ రైల్వే చెన్నై డివిజన్‌లో ఆదివారం బీచ్-తాంబరం సెక్షన్‌లోని రైలు మార్గాల్లో నిర్వహించిన రైలు భద్రతా నిర్వహణ పనులు ముమ్మరంగా సాగాయి. నాలుగు గంటలా 15 నిమిషాలపాటు రైల్వే సాంకేతిక సిబ్బంది, ఇంజనీరింగ్ నిపుణులు, కార్మికులు కలిసి కట్టుగా సునిశిత శిక్షణ పొందిన సైనికుల్లా ఈ మరమ్మతులు జరిపి అందరినీ ఆశ్చర్యపరిచారు. రైలు పట్టాల మరమ్మతులు, కంకర లెవలింగ్, పట్టాల తొలగింపు, చెట్ల తొలగింపు వంటి పనులను ఎక్స్‌కవేటర్లు తదితర సాంకేతిక పరికరాలను కూడా ఉపయోగించారు. తాంబరం రైలు మార్గంలో 44 విద్యుత్ రైళ్లను రద్దు చేసి మరీ ఈ రైలు మార్గం భద్రతా మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనులకుగాను మహానగర రవాణా సంస్థ తాంబరం మార్గంలో అదనపు బస్సులు, మెట్రోరైలు సంస్థ అదనపు రైలు సర్వీసులను నడిపాయి.



జంక్షన్ బాక్సులకు మరమ్మతులు చేస్తున్న కార్మికులు





ఎక్స్‌కవేటర్ సాయంతో చెట్లను తొలగిస్తున్న కార్మికులు - పట్టాల క్రాసింగ్ వద్ద పనులు చేస్తున్న నిపుణులు



హైఓల్టేజీ కేబుళ్లను మారుస్తున్న ఇంజనీరింగ్ నిపుణులు